# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం ı 8 ı నవంబర్ ı 2024






**టన్ను చీనీ రూ.32 వేలు**
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.32 వేలు, కనిష్టంగా రూ.12 వేలు, సరాసరిన రూ.22 వేల ప్రకారం ధర పలికాయి.



**కిలో టమాట రూ.30**
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.24 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.2°/16.8°

జిల్లా పరిధిలో గురువారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి సవిత



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి తదితరులు

**గోరంట్ల:** మండలంలోని బూదిలి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి సమీపంలో దాదాపు రూ.90 కోట్ల వ్యయంతో ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో నిర్మించిన 220 కేవీ సబ్‌స్టేషన్‌ను గురువారం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ప్రాంభించారు. గోరంట్ల ,చిలమత్తురు, పాలసముద్రం సమీపంలో ఏర్పాటైన పరిశ్రమలకు విద్యుత్ లోఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో గొల్లపల్లి సమీపంలో 220 సబ్‌స్టేషన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. పనులు సైతం ఏడాది క్రితం పూర్తయ్యాయి. గురువారం మంత్రి సవిత సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ పార్థసారథి, కలెక్టర్ టీఎస్ చేతన్, పుట్టపర్తి ఆర్‌డీఓ సువర్ణ, ట్రాన్స్‌కో ఎస్‌ఈ వరప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

### ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి అప్రెంటిస్‌షిప్

**పుట్టపర్తి టౌన్:** వివిధ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీరునలైన వారికి ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసే అవకాశం కల్పిస్తున్నట్లు కర్నూలు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో డీజిల్ మెకానిక్ 28, మోటర్ మెకానిక్-3 ఎలక్ట్రీషియన్ - 3, ఫిట్టర్-1, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ -1, పెయింటర్ ట్రేడ్ -1 మొత్తం 37 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 19 నుంచి www.apprenticeshipindia.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారం కోసం 7382869399, 7382873146 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### బావపై హత్యాయత్నం

- పరిటాల శ్రీరామ్ అనుచరుల దౌర్జన్యం



గాయపడిన దినేష్

**సోమందేపల్లి:** మండల కేంద్రంలోని మారుతీనగర్‌కు చెందిన వడ్డె దినేష్‌పై బావ మరుదులు రవి, గణపతి మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం అర్ధరాత్రి తన ఇంటిలో నిద్రిస్తుండగా రామగిరి మండలం వెంకటాపురానికి చెందిన కొందరు రెండు వాహనాల్లో వచ్చి తనపై దాడి చేసినట్లు పేర్కొన్నారు. కొన్నేళ్ల క్రితం వెంకటాపురంలో తాను వివాహం చేసుకున్నట్లు చెప్పారు. ఆస్తికి సంబంధించి గొడవల్లో భాగంగా తన భార్య అలివేలమ్మ తన అమ్మ సుంకమ్మతో రెండు క్రితం గొడవ పడిందన్నారు. ఇద్దరికీ సర్ది చెప్పగా భార్య అలివేలమ్మ తన సోదరులు రవి, గణపతికి చెప్పడంతో వాళ్ల మరి కొందరితోఓ కలసి వచ్చి దాడి చేశారన్నారు. ఇప్పటికే రెండు సార్లు వాళ్ల దాడి చేశారని చెప్పారు. పరిటాల శ్రీరామ్ సొంతూరు కావడం, వాళ్ల దగ్గరే పనిచేస్తుండడంతో వారి అండతోనే తమపై దాడి చేసినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. వారి నుంచి రక్షణ కల్పించాలని ఎస్ఐ రమేష్ బాబును కోరారు.

### నియామక పత్రాల అందజేత



నియామక పత్రాన్ని అందిస్తున్న డీఈఓ కిష్టప్ప

**పుట్టపర్తి:** జిల్లాలోని కేజీబీవీల్లో పోస్టింగ్ దక్కించుకున్న 55 మంది ఉపాధ్యాయులకు డీఈఓ కిష్టప్ప గురువారం నియామక పత్రాలు అందజేశారు. బుక్కపట్నంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ఇందుకు సంబంధించి 1:5 నిష్పత్తిలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 70 మంది హాజరు కాగా, 55 మంది అర్హత సాధించారు. మిగిలిన 15 పోస్టులకు సంబంధించి త్వరలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేపట్టి ఎంపిక చేయనున్నట్లు డీఈఓ తెలిపారు.

## అవినీతి అపార్‌ం




» **ధ**ర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ మహబూబ్ తన కుమారుడిని ఓ ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదివిస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం అపార్ నమోదు కోసం పాఠశాలలోని ఉపాధ్యాయులు ఎంట్రీ చేసేందుకు ప్రయత్నించారు. ఇంటి పేరు తప్పుగా ఉండటంతో సాధ్యపడలేదు. దీంతో మునిసిపల్ కార్యాలయంలో ఇంటి పేరు మార్చుకునేందుకు మీసేవలో దరఖాస్తు చేసుకుని పది రోజులుగా తిరుగుతూనే ఉన్నాడు. అయినా పనిమాత్రం కాలేదు. ఆఖరికి మళ్లీ వెళ్లి రూ.800 ముడుపు చెల్లించగానే అధికారులు క్షణాల్లో పని చేసిపెట్టారు.

» **ధ**ర్మవరంలోని సుందరయ్యనగర్‌కు చెందిన సూర్యనారాయణ. తన కుమార్తె ఇంటిపేరు మార్చుకునేందుకు మీసేవలో దరఖాస్తు చేసుకున్నాడు. వారం రోజులు గడుస్తున్నా ఇంత వరకూ అధికారులు స్పందించలేదు. చేసేదిలేక మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న దళారుల సహాయంతో రూ.600 చెల్లించడంతో సదరు దరఖాస్తును అధికారులు అప్రూవ్ చేశారు.

**ధర్మవరం మునిసిపాలిటిలో అవినీతి దందా**

- జనన, మరణ నమోదులో అధికారుల చేతివాటం
- అవినీతి ఉద్యోగులకు వరంలా మారిన 'అపార్'
- ఇంటిపేరు మార్పు చేర్పులకు క్యూ కడుతున్న తల్లిదండ్రులు
- చేయి తడిపితేనే పనిచేస్తున్న వైనం

**ధర్మవరం:** ధర్మవరం మునిసిపాలిటీ అవినీతికి కేరాఫ్‌గా మారింది. ఇక్కడ ఏ పని చేయాలన్నా అధికారుల చేయి తడపాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలోని జనన, మరణ విభాగంలో అధికారులు, సిబ్బంది కుమ్మక్కై ఇష్టారాజ్యంగా లంచాలు వసూలు చేస్తున్నారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు సంబంధించిన అపార్ ఐడీ క్రియేషన్ అవినీతి అధికారులకు వరంలా మారింది. డబ్బులిచ్చిన వారి దరఖాస్తులు క్షణాల్లో అప్రూవ్ అవుతుండగా ఇవ్వని వారికి చుక్కలు చూపిస్తున్నారు. విద్యార్థుల సర్టిఫికెట్ల పారదర్శకత, ఇంటి పేరుతో సహా ఏ తరగతి చదివినా ఒకే డేటా లభ్యమయ్యేలాగా అక్రమాలకు తావులేకుండా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీని క్రియేట్ చేసేలాగా చర్యలు చేపట్టింది. ఈ ఐడీ క్రియేట్ చేయాలంటే బర్త్ సర్టిఫికెట్ నుంచి వివిధ తరగతులు చదివే ప్రతి ఒక్క విద్యార్థికి ఒకేలాగా ఇంటిపేరు, పేరు ఉండాలి. ధర్మవరం పట్టణంలో వివిధ పాఠశాలల్లో సగానికి పైగా చదివే విద్యార్థులలో స్టడీ సర్టిఫికెట్‌లో ఒకలా, టీసీలో ఒకలా, మార్కుల జాబితాలో ఒకలాగా పేరు, ఇంటి పేరు ఉండటంతో ఐడీ క్రియేట్ నమోదు చేసేందుకు వీలుపడటం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల్లో స్టడీ సర్టిఫికెట్ రాయించుకుని బర్త్ సర్టిఫికెట్‌లో మార్పులు చేయించుకుని ఆపై ఆధార్ కార్డు మార్చుకునేందుకు క్యూ కడుతున్నారు.

**అవినీతిలో ఆ ముగ్గురే కీలకం**

కార్యాలయంలోని శానిటేషన్ విభాగానికి చెందిన ముఖ్య అధికారి, మరో మహిళా అధికారిణితో పాటు కాంట్రాక్ట్ బేసిక్‌గా పనిచేసే సిబ్బంది సిండికేట్‌గా మారి అవినీతి దందా చేస్తున్నట్లు తెలిసింది. డబ్బులు ఇచ్చిన వారి దరఖాస్తులను వెంటనే అప్రూవ్ చేస్తుండగా ఇవ్వని వారి దరఖాస్తులను వారాల తరబడి తిప్పుకుంటున్నట్లుగా తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సర్టిఫికెట్లు మార్చి ఇవ్వాలని సదు పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తుండటంతో చేసేది లేక డబ్బులు ముట్టజెబుతున్నట్లుగా తెలిసింది.



బర్త్ సర్టిఫికెట్‌లలో మార్పుల ఆమోదం కోసం వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

**లంచం ఇస్తేనే పని**

అపార్ నమోదులో విద్యార్థి ఇంటి పేరు, జనన నమోదు తేదీ తదితర అంశాలు తప్పులుంటే పాఠశాలలో స్టడీ సర్టిఫికెట్ రాయించుకుని మీసేవలో తల్లిదండ్రుల ఆధార్ కార్డులతో పాటు ఇతర ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలి. అ దరఖాస్తును పరిశీలించి మునిసిపల్ అధికారులు అప్రూవ్ చేయాల్సి ఉంటుంది. అయితే అప్రూవ్ చేసేందుకు అధికారులు ఒక్కో దరఖాస్తుకు రూ. 800ల దాకా వసూలు చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

**ఒక్కో దరఖాస్తుకు ఒక్కో రేటు**

కార్యాలయంలో జనన, మరణ విభాగంలోకి వచ్చిన ఒక్కో దరఖాస్తుకు ఒక్కో రేటు వసూలు చేస్తున్నట్లుగా సమాచారం. బర్త్ సర్టిఫికెట్‌లో ఇంటిపేరు మార్పుకైతే రూ.800లు, డేట్ ఆఫ్ బర్త్ లేని విద్యార్థులకు నాన్ అవేలబులిటి సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.1000, ఇతర దరఖాస్తులకు పనిని బట్టి రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారంటున్నారు. డబ్బులు ఇవ్వని వారి దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో పెడుతున్నారని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అవినీతి అధికారులు మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ అవినీతి తంతు కొనసాగిస్తున్నారు.

### కార్యకర్తకు అండగా వైఎస్సార్‌సీపీ నాయకులు



నల్లచెరువు: జామీనుపై బయటకు వచ్చిన అంజితో నాయకులు

**నల్లచెరువు:** నల్లచెరువు పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసి నిర్బంధించిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తకు ఆ పార్టీ నాయకులు అండగా నిలిచారు. బుధవారం మండలంలోని కె.పూలకుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త ఆంజనేయులు (అంజి వాల్మీకి) ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడనే కారణంగా బుధవారం నల్లచెరువు పోలీసులు అతన్ని అక్రమంగా అరెస్ట్ చేసి నిర్బంధించారు. విషయం తెలుసుకున్న కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి గురువారం డీఎస్పీ శివనారాయణస్వామితో మాట్లాడారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సోషల్ మీడియా కార్యకర్త అంజిని జామీనుపై బయటకు తీసుకొచ్చారు. వారితో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దశరథనాయుడు, రైతు సంఘం నాయకుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు హైటెక్ రమణ, కళ్లిపల్లి శ్రీనివాసులు, రమణ, బాబూరెడ్డి, దొడ్డెప్ప, రామాంజనేయులు, ఆదిమూర్తి, ఎల్లారెడ్డి, సిద్దా ఆదెప్ప, రెడ్డెప్ప, తదితరులు ఉన్నారు.

### భూ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



మట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

**ప్రశాంతి నిలయం:** గ్రామసభల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యలపై అవగాహన పెంపొందించుకుని వాటిని సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి గ్రామ సభల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీ, రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామసభల షెడ్యూల్‌ను సిద్ధం చేయాలన్నారు. అనువైన స్థలాలను గుర్తించి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామ సభ నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో స్వీకరించే సమస్యలను సంబంధిత తహసీల్దార్లు, వీఆర్వోలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఆర్డీఓలు కూడా క్షేత్రస్థాయిలో తహసీల్దార్ల పనితీరుపై పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా డివిజన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరిగినా షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.

## ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులా?

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

**పెనుకొండ రూరల్:** ప్రశ్నిస్తే కేసులు పెట్టడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతుండటం సరి కాదన్నారు. ఇటీవల రొద్దం మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త బాలాజీరెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. అనంతరం నోటీసులతో విడుదల చేసినప్పటికీ విచారణల పేరుతో పోలీసులు వేధించడం సమంజసమా? అని ప్రశ్నించారు. అలాగే నల్లచెరువు మండలం కె.పూలకుంటకు చెందిన. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త, దినసరి కూలి ఆంజనేయులు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే బుధవారం అక్రమంగా అరెస్టు చేశారన్నారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అక్రమ నిర్బంధనలు ప్రజలను ఎన్నో రోజులు ఆపలేవన్నారు. ప్రతి కార్యకర్తకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ నరసింహులు, శ్రీకాంత్‌రెడ్డి, కొండలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'దీపం' పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

**ప్రశాంతి నిలయం:** జిల్లాలో అర్హులందరూ దీపం పథకం ద్వారా లబ్ధి పొందాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో పౌరసరఫరాల అధికారులతో జేసీ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు కలిగి ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న వినియోదారులకు ప్రతి ఆర్థిక సంవత్సరానికి మూడు ఉచిత ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో 5,72,517 గ్యాస్ కనెక్షన్లకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. దీపం-2 పథకం సక్రమంగా అమలు చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులు మొదట రుసుము చెల్లిస్తే 48 గంటల్లో తిరిగి ప్రభుత్వం వారి ఖాతాల్లోకి నగదు జమ చేస్తుందన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి గ్యాస్ కనెక్షన్ క్రియా క్రియాశీలకంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. గ్యాస్ కనెక్షన్ పొందే క్రమంలో ఏవైనా సందేహాలు ఉంటే కలెక్టర్ కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ అధికారిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు రాజీవ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి జయంతికి ప్రత్యేక బస్సులు




మాట్లాడుతున్న ప్రజా రవాణాధికారి మధుసూధన్

**పుట్టపర్తి టౌన్:** సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 22, 23, 24 తేదీల్లో పుట్టపర్తి పట్టణానికి మహానగరాలతో పాటు పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సరీ్వసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ ఇన్ చార్జులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ రమేష్‌బాబు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ సత్యసాయి జయంత్యుత్సవాల నేపథ్యంలో హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విజయవాడతో పాటు పలు ప్రాంతాల నుంచి తరలివచ్చే సత్యసాయి భక్తుల సౌకర్యార్థం 22, 23, 24 తేదీల్లో వంద ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి సర్వీసులు పెంచుతామన్నారు. పుట్టపర్తి రైల్వేస్టేషన్ - పుట్టపర్తి 15, కొత్తచెరువు - పుట్టపర్తి- బుక్కపట్నం 15, ధర్మవరం రైల్వేష్టేషన్ - పుట్టపర్తి 15, కదిరి - పుట్టపర్తి 10, హిందూపురం- పుట్టపర్తి 10, పెనుకొండ- పుట్టపర్తి 5, అనంతపురం- పుట్టపర్తి 15, చెన్నై - పుట్టపర్తి 5, హైదరాబాద్- పుట్టపర్తి 5, బెంగుళూరు - పుట్టపర్తి 5 సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రమేష్ బాబు మాట్లాడుతూ శ్రీసత్యసాయిని ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

## కానిస్టేబుళ్లపై ఎర్ర కన్ను

- పోలీసు సిబ్బందికి రాజకీయ రంగు
- టార్గెట్ చేసుకుని సరిహద్దుకు బదిలీలు
- గత ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారని ముద్ర
- ఎస్పీ కార్యాలయంలో చక్రం తిప్పుతున్న ఓ అధికారి



**సాక్షి, పుట్టపర్తి:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని శాఖల ఉద్యోగులకు రాజకీయ రంగు పులిమారు. ఆయా స్థానాలకు తమ వారిని తెచ్చుకునేందుకు అప్పటికే అక్కడ ఉన్న వారిని వైఎస్సార్‌సీపీ మద్దతుదారులనే బ్రాండ్ వేసి బదిలీ చేస్తున్నారు. పోలీసు విభాగంలో ఇన్నాళ్లూ సీఐ, ఎస్ఐల బదిలీల్లో కూటమి నేతలు చక్రం తిప్పారు. తమకు నచ్చిన వారిని తెచ్చుకునేందుకు ఉన్నవారికి స్థానచలనం కల్పించారు. కొందరికి రాజకీయ ముద్ర వేసి ఇప్పటికీ పోస్టింగులు ఇవ్వకుండా వీఆర్‌లోనే ఉంచేలా చేశారు. ఇదిలా ఉండగా.. వారం రోజులుగా కొందరు కానిస్టేబుళ్లపై కూడా కక్షపూరితంగా వ్యవహరిస్తూ కర్ణాటక సరిహద్దు స్టేషన్లకు బదిలీ చేయిస్తున్నట్లు తెలిసింది. జిల్లా పోలీసు కార్యాలయంలో పని చేసే ఓ అధికారి నేతృత్వంలోనే బదిలీల ప్రక్రియ జరుగుతోందని సమాచారం. కూటమి నేతల సూచన మేరకు ఆ అధికారి.. జాబితా తయారు చేసి ఉన్న స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బదిలీ చేసేందుకు శ్రీకారం చుట్టారట. ఇప్పటికే కొందరు కానిస్టేబుళ్లపై బదిలీ వేటు పడింది. ఏనాడూ ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా పని చేసిన దాఖలాలు లేకున్నా.. గత ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ నేతలకు మద్దతు పలికారని ఆరోపిస్తే చాలు బదిలీ వేటు వేస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేక చాలా మంది కానిస్టేబుళ్లు ఇబ్బందులు పడుతున్నారు.

**విధులు సక్రమంగా నిర్వర్తించడమే తప్పా?**

విధి నిర్వహణలో భాగంగా ఆయా స్టేషన్ల పరిధిలో ఉన్నతాధికారుల సూచన మేరకు ఎన్నో ఏళ్లుగా సక్రమంగా నడుచుకున్న వారిని సైతం పక్కన బెట్టేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇదేంటని ప్రశ్నిస్తే.. ఇక్కడి నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న స్టేషన్‌కు పంపిస్తామని బెదిరిస్తున్నట్లు వాపోతున్నారు. ఇప్పటికే ధర్మవరం, హిందూపురం, కదిరి నియోజకవర్గ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో చాలామంది కానిస్టేబుళ్లను రాజకీయ రంగు పూసి కక్షపూరితంగా బదిలీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. సామాజిక సమీకరణాలతో పాటు సదరు ఉద్యోగి బంధువుల్లో ఎవరైనా వైఎస్సార్‌సీపీలో ఉన్నారంటే వెంటనే బదిలీ కావాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేస్తున్నారు.

**ఆ అధికారే కీలకం**

కానిస్టేబుళ్ల బదిలీల్లో ఎస్పీ కార్యాలయంలో పని చేసే ఓ అధికారి కీలకంగా మారని చెబుతున్నారు. ఆ సారు చెబితే సదరు కానిస్టేబుల్‌పై బదిలీ వేటు కచ్చితమని అంటున్నారు. దీంతో ఆ అధికారిపై చాలా మంది గుర్రుగా ఉన్నారు. కానీ ఆయన మాత్రం తన వద్ద 'రెడ్ బుక్' ఉందని చెప్పకనే చెబుతున్నారు. కొన్ని స్టేషన్ల పరిధిలో ఎస్ఐ, సీఐలను కాదని.. ఆయన చెలామణి అవుతుండటం విశేషం. చాలా స్టేషన్ల అధికారులు ఆయనపై జిల్లా పోలీసు అధికారులకు కూడా ఫిర్యాదులు చేశారని సమాచారం.

**సిబ్బంది అవస్థలు**

పిల్లల చదువు, కుటుంబ భాగస్వామి ఉద్యోగం తదితర కారణాల రీత్యా ఓ ప్లానింగ్ ప్రకారం సాగిపోతున్న ఉద్యోగులపై 'రెడ్ బుక్' రాజ్యాంగం నెత్తిన పిడుగులా పడుతోంది. ఉన్నఫలంగా అక్కడికి వెళ్లలేక.. మకాం మార్చలేక.. పిల్లల స్కూళ్లు వదలలేక.. నానా అవస్థలు పడుతున్నారు. ఎలాంటి సమస్య లేకున్నా.. కేవలం రాజకీయ కోణంలో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు.

**బదిలీలు సహజమే**

వినతుల మేరకు కొన్ని బదిలీలు జరిగాయి. ఇంకొన్ని నిబంధనల ప్రకారమే చేశాం. ఎక్కడా రాజకీయ కోణం లేదు. ఎవరిపైనా కుట్ర జరగలేదు. బయట చెప్పే అవాస్తవాలు ఎవరూ నమ్మవద్దు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎలాంటి రెడ్ బుక్ లేదు. పోలీసుశాఖలో పని చేసే సిబ్బంది అందరూ ఒక్కటే. – వి.రత్న, ఎస్పీ

## సోషల్ మీడియా కార్యకర్త ఇంట్లో సోదాలు

**కదిరి అర్బన్:** ఉగ్రవాదులు, నక్సలైట్ల ఇళ్లలో సోదాలు చేసినట్లు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త ఇంట్లో పోలీసులు గురువారం సోదాలు చేశారు. కదిరి మండలం వీరచిన్నయ్యగారిపల్లికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్త అమరనాథ్‌రెడ్డి ఇంట్లో రూరల్ మండల పోలీసులు సోదాలు నిర్వహించారు. తన కుమారుడిని పోలీసులు తీసుకెళ్లి ఇంతవరకు విడిచిపెట్టలేదని అమరనాథ్‌రెడ్డి తండ్రి గంగిరెడ్డి (పెరాలసిస్ పేషంట్) కుమారుడిని వెతుక్కుంటూ ఇంటికి తాళం కూడా వేయకుండా కదిరికి వచ్చాడు. ఈ నేపథ్యంలో నలుగురు పోలీసులు అమరనాథ్‌రెడ్డిని ఇంట్లో మొత్తం సోదాలు నిర్వహించారు. అయితే వారికి ఏమీ దొరకలేదు. బీరువా తాళం వేసి ఉండడంతో ఆ తాళం గంగిరెడ్డి వద్ద ఉండటంతో బీరువా చెక్ చేయాలని ఇంట్లోకి ఎవరూ ప్రవేశించకుండా పోలీసులు తాళం వేశారు. గంగిరెడ్డి కదిరి నుంచి వచ్చాక బీరువా చెక్ చేసి తాళం ఇస్తామని పోలీసులు చెప్పినట్లు తెలిసింది. అమర్‌నాథ్‌రెడ్డి కుటుంబం ఏమైనా ఉగ్రవాది కుటుంబమా? కేవలం ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా పోస్టులు పెడితే ఇంత దారుణంగా వ్యవహరిస్తారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.



అమరనాథ్‌రెడ్డి ఇంటికి తాళం వేసిన పోలీసులు

## క్లుప్తంగా

### గ్రానైట్ పరిశ్రమలో కార్మికుడి మృతి


మృతుడు రమేష్‌నాయక్

తాడిపత్రి రూరల్: స్థానిక సజ్జలదిన్నె వద్ద ఉన్న గోపాలరెడ్డి గ్రానైట్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. తాడిపత్రి అప్‌గ్రేడ్ రూరల్ పీఎస్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా మొలకలచెరువు తండాకు చెందిన రమేష్ నాయక్ (33) ఐదేళ్ల క్రితం కుటుంబంతో కలసి తాడిపత్రికి వలస వచ్చాడు. గోపాలరెడ్డి గ్రానైట్ పరిశ్రమలో కార్మికుడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి పనిలో నిమగ్నమై ఉండగా కటింగ్ మిషన్ ఒక్కసారిగా స్తంభించింది. దీంతో దానిని సరిచేస్తుండగా గుండు అదుపు తప్పి రమేష్ నాయక్ ఛాతీని బలంగా తాకింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### విద్యారంగ సమస్యలు పరిష్కరించండి


డీఈఓ కిష్టప్పను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పుట్టపర్తి అర్బన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని డీఈఓ కిష్టప్పకు పీఆర్‌టీయూ నాయకులు విన్నవించారు. ఈ మేరకు గురువారం డీఈఓను ఆయన కార్యాలయంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రజనీ కాంతరెడ్డి, తదితరులు కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. అంతకు ముందు నూతన డీఈఓను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు శ్రీరాములు, జి.రామకృష్ణారెడ్డి, చంద్రమోహన్, రామయ్య, రామాంజనేయులు, ఆజాద్, ఇర్షాద్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

# స్నాక్స్... కారాదు విషం

వీధుల్లో అందుబాటులో ఉన్న ఏదొక స్నాక్ తినడం చాలా మందికి అలవాటు. రోజూ క్రమం తప్పకుండా వెళ్లి తినేవారు చాలా మంది ఉన్నారు. రుచికి బాగుండటంతో వాటికే అలపడి రోజూ కడుపులో పడేస్తారు. అయితే.. ఆ స్నాక్స్ తింటే ప్రాణానికి ప్రమాదమని తెలుసా? ఎందుకంటే వాటిల్లో వాడే పదార్థాలన్నీ అనారోగ్యకరమైనవేనని వైద్యులు అంటున్నారు. వాటిని తినడం వల్ల.. జీర్ణ సమస్యలు, గుండె ప్రమాదం, బరువులో వ్యత్యాసం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయని హెచ్చరిస్తున్నారు.

- మార్కెట్‌లో నాణ్యత లేని చిరుతిండ్లు
- పిల్లలను ఆకట్టుకునేలా స్నాక్స్ ప్యాకింగ్
- చిన్నారుల ఆరోగ్యానికి ప్రమాదమంటున్న వైద్యులు


ఆకర్షణీయ ప్యాక్‌లలో విక్రయిస్తున్న స్నాక్స్

| | |
|---|---|
| జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు | 2,078 |
| విద్యార్థుల సంఖ్య | 1,47,000 |
| ప్రైవేట్ పాఠశాలలు | 430 |
| ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య | 80 వేలు |

హిందూపురం: జిల్లాలో చిన్నారులు, విద్యార్థులే లక్ష్యంగా పాఠశాలల పరిసర ప్రాంతాల్లో నాసిరకం స్నాక్స్ విక్రయాలు ఊపందుకున్నాయి. వాటిని తిన్న పిల్లల్లో పలు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇటీవల జిల్లాస్పత్రికి చికిత్స కోసం వస్తున్న చిన్నారులు, విద్యార్థుల అనారోగ్యానికి నాసిరకం స్నాక్స్ కారణమని వైద్యులు సైతం నిర్ధారించారు.

**పిల్లల ఆరోగ్యాలకు ప్రమాదం**

జిల్లాలో ఇటీవల చిన్న పిల్లల వైద్యుల వద్ద కేసులు బాగా పెరుగుతున్నాయి. గ్యాస్ట్రిక్, కడుపు నొప్పి, వాంతులు తదితర అనారోగ్య సమస్యలతో తరచూ వైద్యుల చుట్టూ తిరుగుతున్న వారి సంఖ్య పెరిగింది. ఈ విషయంపై లోతైన అధ్యయనం చేసిన వైద్యులు చివరకు చిన్నారులు, విద్యార్థులు తింటున్న స్నాక్స్‌నే కారణమని నిర్ధారించారు. ఇలాంటి నాసిరకం స్నాక్స్ తినడం వల్ల పిల్లల్లో శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసం లోపిస్తుందని హెచ్చరిస్తున్నారు. బ్రాండెడ్ పదార్థాల కంటే మెరుగ్గా ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్న స్నాక్స్‌ను తినకుండా ఉండడమే మేలంటున్నారు. కాగా, బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్న నాసిరకం చిరుతిళ్లపై, వాటి ఉత్పత్తి సంస్థల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో విచ్చలవిడిగా లోకల్ స్నాక్స్ తయారీదారులు తమ అక్రమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

**జాగ్రత్తగా ఉండాలి**



మార్కెట్‌లో లభ్యమయ్యే తినుబండారాలకు పిల్లలను దూరంగా ఉంచాలి. వీటి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌ను చూసి మోసపోరాదు. వాటిలో వాడే రసాయనాలు పిల్లల ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. కడుపు నొప్పి, లివర్, కిడ్నీ సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇంటి వద్ద బెల్లంతో వేరుశనగ, నువ్వులు కలిపి ముద్దలు చేసి ఇవ్వడం మంచిది. దీని వల్ల మెరుగైన ఆరోగ్యంతో పాటు రక్తహీనతనూ అధిగమించవచ్చు. అయితే ఏవీ అతిగా తినకూడదు.

– డాక్టర్ శివకుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణుడు, జిల్లాస్పత్రి, హిందూపురం

### అసభ్యకర పోస్టులు పెడితే ఉపేక్షించం : ఎస్పీ

పుట్టపర్తి టౌన్: అవాస్తవాలు ప్రచారం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా, వ్యక్తి స్వభిమానాన్ని దెబ్బతీసేలా పోస్టులు పెట్టడం, వాటిని వైరల్ చేయడం సరికాదన్నారు. మత పరమైన సున్నిత అంశాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు.

### చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రామగిరి: ఈ ఏడాది జూలై 11న రాత్రి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో చొరబడి 50 కిలోల బరువున్న మూడు బియ్యం బస్తాలతో పాటు 65 ఇంచ్‌ల స్మార్ట్ టీవీని అపహరించుకెళ్లిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ గురువారం వెల్లడించారు. చోరీ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో రామగిరికి చెందిన హరిజన రమేష్ తీరుపై అనుమానాలు వ్యక్తం కావడంతో గురువారం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో నేరం అంగీకరించాడు. దీంతో నిందితుడిపై కేసు నమోదు చేసి, రూ.1.24 లక్షల విలువైన స్మార్ట్‌టీవీ, మూడు బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు.

### 8 మందిపై కేసు నమోదు

కదిరి టౌన్: తనకు దక్కాల్సిన భూ పరిహారాన్ని కాజేశారంటూ బాధిత రైతు చేసిన ఫిర్యాదు మేరకు 8 మందిపై కేసు నమోదు చేసినట్లు కదిరి సీఐ నారాయణరెడ్డి తెలిపారు. గాండ్లపెంటకు చెందిన షేక్ రహంతుల్లాకు కదిరి–మదనపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం అధికారులు చేపట్టిన భూసేకరణలో 1.25 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఇందుకు సంబంధించి రూ.57 లక్షల పరిహారాన్ని మంజూరు చేసింది. ఈ పరిహారాన్ని తుమ్మల అమీనాబీ, అయూబ్ ఖాన్, హుస్సేన్ ఖాన్, హిదయతుల్లా, ఖలీల్ అహమ్మద్, ఇలాహి, దాదాపీర్ నకిలీ పత్రాలు సృష్టించి కాజేశారని, ఇందుకు రెవెన్యూ అధికారి మున్వర్ సహకరించారంటూ బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు... రెవెన్యూ అధికారితో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

## విద్యార్థినులతో అసభ్యకర ప్రవర్తన

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు


బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన బాబ్జాన్

ధర్మవరం అర్బన్: స్థానిక ఇందిరమ్మ కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మద్యం మత్తులో చొరబడిన ఓ పోకిరీ ఇద్దరు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. గమనించిన స్థానికులు దేహశుద్ధి చేశారు. వివరాలు... గురువారం మధ్యాహ్నం పాఠశాల వేళలో ఆవరణలోకి చొరబడిన యువకుడు అక్కడి ఇద్దరు విద్యార్థినులకు మాయ మాటలు చెప్పి బయటకు పిలుచుకెళ్లాడు. అనంతరం వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండడంతో స్థానికులు గమనించి అడ్డుకోబోయారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న యువకుడు వాగ్వాదానికి దిగడంతో అసహనానికి గురైన స్థానికులు వెంటనే దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విచారణలో సదరు యువకుడు కదిరి పట్టణానికి చెందిన బాబ్జాన్‌గా పోలీసులు గుర్తించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాఠశాలకు చేరుకుని ఆకతాయిలను పాఠశాలలోకి ఎలా రానిస్తారంటూ హెచ్‌ఎం కుళ్లాయప్పను నిలదీశారు. ప్రహరీకి అమర్చిన గేటు విరిగిపోవడంతో ఆకతాయిలు చొరబడుతున్నారని హెచ్‌ఎం ఇచ్చిన సమాధానంతో వారు సంతృప్తి చెందలేదు. గేట్ మరమ్మతు చేయించకుండా నిర్లక్ష్యంగా ఉన్నారంటూ మండిపడ్డారు. అనంతరం విద్యార్థి సంఘం నాయకుడు పోతులయ్యతో కలసి ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాల హెచ్‌ఎం కుళ్లాయప్ప నిర్లక్ష్యం కారణంగానే ఆవరణలోకి జులాయిలు చొరబడి బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. హెచ్‌ఎం కుళ్లాయప్పను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

## తల్లీ... నిను వీడి ఉండలేను

- బుధవారం చోటు చేసుకున్న ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు తీవ్ర గాయాలు
- బెంగళూరుకు తరలిస్తుండగా కుమార్తె మృతి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి తండ్రి కూడా...


రమేష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: తాను ఎక్కడున్నా.. కుమార్తెలు బాగుండాలని పరితపించాడు. వారి అభ్యున్నతి కోసం బాటలు వేశాడు. క్రీడలపై మక్కువ పెంచుకున్న పెద్ద కుమార్తెను జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదిగేలా ప్రోత్సహించాడు. ఈ శుభ పరిణామాన్ని భార్య, మరో కుమార్తెతో పంచుకుని సంబరపడాలనుకున్న ఆయన ఆనందం క్షణాల్లోనే ఆవిరైంది. బొలెరో రూపంలో దూసుకొచ్చిన మృత్యువు కుమార్తెను కబలించగా... కుమార్తె జ్ఞాపకాలతో తల్లీ... నిను వీడి నేను ఉండలేనంటూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తండ్రి కూడా మరణించాడు. ఈ ఘటనతో పెనుకొండలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**బిడ్డలే సరస్వమూ అనుకుని...**

ధర్మవరానికి చెందిన రమేష్ రొద్దంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఈటీగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తన విధులకు సౌకర్యవంతంగా ఉండేలా భార్య మల్లిక, కుమార్తెలు సాయి భవిత (15), తనుశ్రీతో కలసి పెనుకొండలో నివాసం ఏర్పరుచుకున్నారు. బిడ్డలే తన సరస్వంగా భావించిన తల్లిదండ్రులు వారిని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటూ వచ్చారు. పెనుకొండలోని శాంతినికేతన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె సాయిభవితకు హాకీ క్రీడపై మక్కువ ఉండడంతో ఆ దిశగా ప్రోత్సహించారు. దీంతో క్రీడల్లో ఆమె రాణించి నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్టుకు ఎంపికై ంది. ఈ పోటీల్లో రాణించిన సాయి భవిత జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో దక్కించుకుంది. దీంతో ఎంతో సంతోషపడిన తండ్రి, కుమార్తె మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రైలులో ధర్మవరానికి చేరుకున్నారు. రాత్రి అక్కడే పడుకుని బుధవారం ఉదయం పెనుకొండకు ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గ మధ్యంలో గుట్టూరు వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తండ్రి, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉన్న సాయి భవితను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందింది. అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమేష్(40) కూడా బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందాడు. విషయం తెలియగానే పెనుకొండలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతదేహాలను ధర్మవరానికి తరలించి అక్కడే అంత్యక్రియలకు బంధువులు ఏర్పాటు చేశారు.

### శిల్పారామం సీఈఓ ఆకస్మిక తనిఖీ


శిల్పారామాన్ని పరిశీలిస్తున్న సీఈఓ స్వామినాయుడు, తదితరులు

ప్రశాంతి నిలయం: స్థానిక శిల్పారామాన్ని ఏపీ శిల్పారామం సీఈఓ స్వామినాయుడు గురువారం తనిఖీ చేశారు. సందర్శకులు, సాయి భక్తులకు శిల్పారామం సద్వినియోగమవుతోందా, లేదా అనే అంశంపై ఆరా తీశారు. కన్వెన్షన్ హాల్ పనులను సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. రెస్టారెంట్ నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. చేనేతల ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాల కోసం వారంలోపు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మరో రెండు నెలల్లో 3డీ థియేటర్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి శిల్పారామం ఏఓ రమేష్‌రెడ్డి, విజయవాడ ఏఈ యశ్వంత్ , సిబ్బంది పాల్గొన్నారు.

### ముగిసిన జాతీయ సదస్సు

అనంతపురం: జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలోని కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఆధునిక కంప్యూటింగ్ (సూపర్ కంప్యూటింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అంశంపై నిర్వహించిన సదస్సు ముగింపు కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సదస్సుకు హాజరైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఇలాంటి సదస్సుల వల్ల నైపుణ్యాలు అలవడుతాయని పేర్కొన్నారు.

## ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ముగ్గురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విజయకుమార్ (చిత్రంలో) సీఐ సునీత

పుట్టపర్తి టౌన్: యువకుడిని ఆహత్యకు ప్రేరేపించిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను గురువారం ఉదయం పుట్టపర్తిలోని తన కార్యాలయంలో డీఎస్పీ విజయ్‌కుమార్ వెల్లడించారు. బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన మేకల నారాయణస్వామి ఎనిమిదేళ్ల క్రితం పుట్టపర్తికి వలస వచ్చి టెంకాయల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన కుమారుడు మేకల గౌతమ్ (20) ఇంటర్ మీడియట్ చదివి బెంగుళూరులో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. నాలుగు నెలల క్రితం మొహర్రం సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి నారాయణస్వామి స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడ గ్రామంలో అందరూ సందడి చేస్తుండగా నారాయణ స్వామి కూడా ట్రాక్టర్‌ను తోలుతూ ఏదులపల్లి రామ్మోహన్ ఇంటి ముందుగా వెళ్లాడు. దీంతో రామ్మోహన్ కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నారాయణస్వామిని కొట్టారు. ఘటనకు సంబంధించి ఈ నెల 2న టీడీపీ నాయకులతో కలసి బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ కృష్ణమూర్తిని నారాయణస్వామి కలసి తనపై దాడి చేసిన వారిని పిలిపించి, విచారణ చేసి కేసు నమోదు చేయాలని కోరాడు. ఈ విషయం తెలుసుకున్న రామ్మోహన్ కుటుంబసభ్యులు బుక్కపట్నం నుంచి ద్విచక్రవాహంపై వెళుతున్న నారాయణస్వామి కుమారుడు గౌతమ్‌ను అడ్డుకుని బెదిరింపులకు దిగారు. దీంతో మనస్తాపానికి గురైన గౌతమ్ నేరుగా ఇంటికి చేరుకుని బాత్‌రూమ్‌లోకి వెళ్లి శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే మంటలు ఆర్పి బాధితుడిని బెంగళూరులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సకు స్పందించక గౌతమ్ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం ఏదులపల్లి చిన్న రాములు, ప్రసాద్, గోపాల్‌ను కర్ణాటక నాగేపల్లి బ్రిడ్జి వద్ద అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న రామ్మోహన్ కోసం గాలిస్తున్నారు.

### జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపిక


సంహిత

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లోని సెంట్రల్ స్కూల్ విద్యార్థి తాడిమర్రి సంహిత జాతీయ స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 3 నుంచి 4వ తేదీ వరకు వైఎస్సార్ జిల్లా పులివెందులలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి ఏపీ స్కూల్‌గేమ్స్ అండర్–14 విభాగంలో ప్రతిభ చాటిన ఆమె మూడో స్థానం దక్కించుకుని డిసెంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఆమెను ఎస్జీఎఫ్ సెక్రెటరీ సుగుణమ్మ అభినందించారు.

### మున్సిపల్ టీచర్ల వివరాలివ్వండి

- మునిసిపల్ ఆర్డీకి విద్యాశాఖ లేఖ

అనంతపురం ఎడ్యుకేషన్: 'నగరపాలక సంస్థ, ఉమ్మడి జిల్లాలోని మునిసిపల్ స్కూళ్లలో పని చేస్తున్న టీచర్లకు సంబంధించి ఎలాంటి వివరాలు తమవద్ద లేవు. దీంతో పదోన్నతుల ప్రక్రియకు తీవ్ర ఇబ్బందిగా ఉంది...మీ వద్ద ఉన్న పూర్తిస్థాయి వివరాలు వెంటనే ఇవ్వాలి' అంటూ జిల్లా విద్యాశాఖ అధికారి.. మునిసిపల్ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ)కి గురువారం లేఖ రాశారు. మునిసిపల్ స్కూళ్లల్లో పని చేస్తున్న టీచర్లకు పదోన్నతుల అంశంపై ప్రభుత్వం హడావుడి ప్రకటన చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ఇప్పటిదాకా అమలు చేసిందేమీలేదు. 2021 డిసెంబర్ తర్వాత పదోన్నతులు చేపడుతున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించి షెడ్యూలూ విడుదల చేసింది. దీంతో ఆశావహులు పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. షెడ్యూలు ప్రకారం బుధవారం ప్రధానోపాధ్యాయులు, నేడు (శుక్రవారం) స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల కౌన్సెలింగ్ జరగాల్సి ఉంది. అనంతపురం నగరపాలక సంస్థ ఒక యూనిట్‌గా, ఉమ్మడి జిల్లాలోని ఆరు మునిసిపాలిటీలు ఒక యూనిట్‌గా పదోన్నతులు చేపట్టనున్నారు. మునిసిపల్ టీచర్ల వివరాలు విద్యాశాఖ వద్ద లేకపోవడంతో గత నెల 28న ప్రకటించాల్సిన తాత్కాలిక సీనియార్టీ జాబితాను ఈనెల 1న ప్రకటించారు. అదికూడా తూతూమంత్రంగా పాతజాబితాను ప్రదర్శించారు. దీనిపై అభ్యంతరాలు స్వీకరించారు. అభ్యంతరాలు సరిచేశారు. ఖాళీల లెక్క తేలింది. అనంతపురం కార్పొరేషన్‌లో మూడు, మునిసిపాలిటీల్లో మూడు హెచ్‌ఎం పోస్టులు ఖాళీలున్నట్లు గుర్తించారు. స్కూల్ అసిస్టెంట్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు రెండు యూనిట్లలోనూ దాదాపు 10–12 దాకా ఉన్నట్లు (పదోన్నతుల కోసం) గుర్తించారు.

**వివరాలు లేక ఆగిన కౌన్సెలింగ్**

నగరపాలక సంస్థతో పాటు ఆయా మునిసిపాలిటీలకు ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి, పని చేస్తున్న పోస్టులు, ప్రస్తుతం ఖాళీలు, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎన్ని పోస్టులు భర్తీ చేశారు, పదోన్నతులకు ఎన్ని పోస్టులు ఇచ్చారు? రోస్టర్‌కు సంబంధించి ఏపాయింటు ఎక్కడిదాకా ఆగిపోయింది తదితర వివరాలేవీ విద్యాశాఖ వద్ద లేవు. తరచూ మునిసిపల్ ఆర్డీ కార్యాలయానికి వెళ్లి అడుగుతున్నా వారినుంచి సరైన స్పందన లేదు. దీంతో పై వివరాలను కోరుతూ విద్యాశాఖ అధికారులు అధికారికంగా లేఖ రాశారు. ఆ వివరాలు వచ్చిన తర్వాత పరిశీలించి పదోన్నతులు చేపడతామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు.

# టీడీపీలో అగ్గి రాజేసిన 'మద్యం'

- మద్యం వ్యాపారంలో తన వారికి వాటా చెల్లించాలంటూ మంత్రి సవిత హుకుం
- సాధ్యపడదంటూ అధిష్టానంతో మొరపెట్టుకున్న టెండర్‌దారు
- టీడీపీ పెద్దల జోక్యంతో మంత్రికి భంగపాటు
- అయినా తెరవెనుక నుంచి కుట్రలు
- మద్యం దుకాణం ఏర్పాటును అడ్డుకున్న సవిత వర్గీయులు
- ఘటనా స్థలానికి చేరుకుని నచ్చజెప్పిన ఎస్‌ఐ


సర్దిచెబుతున్న ఎస్‌ఐ రంగడుయాదవ్

సాక్షి టాస్క్‌ఫోర్స్: నూతన మద్యం పాలసీ పెనుకొండ నియోజకవర్గ టీడీపీలో అగ్గి రాజేసింది. తనను కాదని మద్యం దుకాణానికి అనుమతి దక్కించుకున్న వ్యక్తిపై గుర్రుగా ఉన్న మంత్రి సవిత... చివరకు వ్యాపారంలో తన వారికి వాటా ఇవ్వాలంటూ హుకుం జారీ చేశారు. ఈ విషయాన్ని టెండర్‌దారుడు ఏకంగా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి సవితకు భంగపాటు ఎదురైంది. దీంతో అధిష్టానం దృష్టిలో తలొగ్గినట్లుగా కనిపించినా... తెరవెనుక నుంచి మద్యం దుకాణం ఏర్పాటుకు పావులు కదిపారు.

**తానొకటి తలిస్తే...**

కూటమి సర్కార్ అందుబాటులోకి తెచ్చిన నూతన మద్యం పాలసీని టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలకు సంపద సృష్టి వనరుగా మారింది. లాటరీలో మద్యం షాప్ దక్కితే ఓకే.. చేజారితే దక్కించుకున్న వ్యక్తి నుంచి తమ వాటా రాబట్టుకునేలా కుట్రలకు తెరలేపారు. ఈ క్రమంలో పరిగి మండలానికి సంబంధించి రెండు మద్యం షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేయగా, తన వ్యక్తులకు అందులో వాటా ఇవ్వాలంటూ లాటరీ దక్కించుకున్న వారికి మంత్రి సవిత మౌఖికంగా హుకుం జారీ చేసినట్టు ఆరోపణలున్నాయి. అయితే మంత్రి అధికారదర్పాన్ని జీర్ణించుకోలేని టెండర్‌దారులు విషయాన్ని ఏకంగా పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి తలొగ్గినట్లు సమాచారం. దీంతో మండల కేంద్రం పరిగిలో ఓ మద్యం షాప్ ఏర్పాటు కాగా, మరో దుకాణాన్ని మోదాల్‌లో ఏర్పాటు చేసేందుకు టెండర్ దక్కించుకున్న వ్యక్తి గురువారం ఏర్పాట్లు చేపట్టారు. ఇందు కోసం పెద్దిరెడ్డిపల్లి గేట్ సమీపంలోని ఓ ప్రైవేట్ స్థలాన్ని ఎంపిక చేసుకుని చదును చేయిస్తుండగా కోడిగెనహళ్లి పంచాయతీకి చెందిన మంత్రి సవిత వర్గీయులు కొందరు స్థానికులను రెచ్చగొట్టి పనులు అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి వీల్లేదంటూ భీష్మించారు.

**అనుమతుల ఆధారంగానే ఏర్పాటు**

విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రంగడు యాదవ్ ఆగమేఘాలపై పెద్దిరెడ్డిపల్లి వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టిన టీడీపీ నాయకులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. నిత్యం మహిళలు, విద్యార్థులు సంచరించే మార్గంలో రోడ్డు పక్కనే మద్యం షాప్ ఏర్పాటు చేస్తే అసాంఘిక శక్తులకు ఊతమిచ్చినట్లవుతుందని టీడీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. పైగా సమీపంలోనే జనావాసాలు, బస్టాండు ఉన్నాయని, ఏదైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే బాధ్యులెవరని ప్రశ్నించారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల ఆధారంగానే మద్యం షాప్‌ను అక్కడ ఏర్పాటు చేస్తున్నారని ఏదైనా అభ్యంతరాలుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.


సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

కావలెను
సేల్స్ ఎగ్జిక్యూటివ్స్: ఫీల్డ్ వర్క్-ఆటోమొబైల్స్ / కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ / ఫైనాన్స్ / FMCG రంగాలలో సేల్స్ / మార్కెటింగ్ / కలెక్షన్స్‌లలో కనీసం 3 సం॥ల అనుభవం కలిగి ఉండవలెను. జీతం: రూ.25,000/-ల నుండి రూ.40,000/- వరకు
ప్రాంతాలు: అనంతపురం, కళ్యాణదుర్గం, పెనుగొండ, హిందూపూర్, తాడిపత్రి
సేల్స్ మేనేజర్: పై రంగాలలో కనీసం 15 సం॥ల అనుభవం కలిగి మరియు టీమ్‌ను హ్యాండిల్ చేయగలిగిన సామర్థ్యం కలిగి ఉండవలెను. జీతం: రూ.45,000/-ల నుండి
ఇంటర్వ్యూ తేది: 09-11-2024 ఉ॥ 10 గం॥ల నుండి మ॥ 2 గం॥ల వరకు
మేరు ఆటోమొబైల్స్ ప్రై.లిమిటెడ్
పాముదాయి గ్రామం, అనంతపురం. ఫోన్: 9849791770

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
GNM (నర్సింగ్) అడ్మిషన్స్
■ ఇంటర్ any గ్రూప్ పాస్ స్టూడెంట్స్ కి GNM నందు గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : జి.మురళి, 9030661651, అనంతపురము. [A-1398]

SERVICES
బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6593]

WANTED
■ ప్రముఖ కంపెనీ నందు వర్క్ చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. Qul: 10th- డిగ్రీ, Sal: 20k-25k ఉచిత రూము భోజనం సదుపాయం, వర్క్ ఫ్రం హోం అవకాశముంది. Cont: 8073902428 [G-9065]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [M-12648]

■ ప్రముఖ టోల్‌ప్లాజా నందు పనికి 10th - PG అర్హతగల కంప్యూటర్ ఆపరేటర్ & క్యాషియర్ కావలెను. 8 గం॥ డ్యూటీ. భోజనం + వసతి. ఆకర్షణీయ జీతం.Loc:అనంతపురం. 70136 43462. [NA-3017]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253910]

■ Marketing trainees both male and female with MBA (Marketing) qualification for real estate business. Salary Rs. 10000/- per month + Fuel allowance. 06 Months probation period. CV to admin atp@mahathiinfradevelopers.com. Mahathi Realtors, Anantapur. Contact:9391756322, 7815906234. [A-511]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
అద్దెకు
అమ్మకం
ఫర్నిచర్స్
ఆటోమొబైల్
కంప్యూటర్స్
సర్వీసెస్
4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307 9010588846
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.